క్లుప్తంగా

124 మందికి ఉచిత ఎక్స్‌రే



ఎక్స్‌రే తీస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్ : క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో భాగంగా మంగళవారం కోడుమూరులోని జంగాల కాలనీలో 124 మందికి ఉచితంగా ఎక్స్‌రే తీసినట్లు కోడుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదన శేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వారానికి మించి దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి మందగించడం బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడడం వంటి లక్షణాలతో బాధపడుతుంటే వెంటనే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వమే వారికి ఉచితంగా మందులు అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్స్ కమాల్ సాహెబ్, ఉమాబాయి, ఎస్‌టీఎస్ వెంకటేశ్వర్లు, రేడియోగ్రాఫర్ శ్రీనివాసులు, ఎస్‌టీఎల్ఎస్ రామమహేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు టీడీపీ అభ్యర్థి కోడ్ ఉల్లంఘన

- సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన న్యాయవాది ఎం.ప్రభాకర్

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి ప్రచారం చేస్తుండడంతో వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రిటర్నింగ్ ఆఫీసర్/ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డికి ఫిర్యాదు చేసింది. ఈనెల 24వ తేదీన బొగ్గుల దస్తగిరి కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడులో చర్చిలో పార్టీ కండువా కప్పుకొని వచ్చిన భక్తులను ఓట్లు అడిగారు. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి, ఆంధ్ర ప్రభ పత్రికలు ప్రచురించడంతో సీవిజిల్ యాప్‌తోపాటు కోడుమూరు ఆర్ఓకు నేరుగా ఫిర్యాదు చేసినట్లు వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్, న్యాయవాది ఎం.ప్రభాకర్ తెలిపారు. దీంతో ఎన్నికల సంఘం అధికారులు పూర్తి స్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

కుమారుడి జ్ఞాపకార్థం గ్రామానికి బోరు



బోరుకు పూజలు నిర్వహిస్తున్న మద్దయ్య

ఓర్వకల్లు: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడిపోతున్నారు. మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమ్మరి మద్దయ్య గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని భావించాడు. జలజీవన్ మిషన్ కింద కొత్త మంచి నీటి ట్యాంక్ మంజూరు కావడంతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. అందుకు అవసరమైన బోరును తన రెండో కుమారుడు మహేంద్రబాబు జ్ఞాపకార్థం స్థానిక యాగంటీశ్వరస్వామి దేవాలయం వద్ద సొంత ఖర్చులు సుమారు రూ.2.50 లక్షలతో బోరును వేయించి, పైపులైన్ నిర్మాణం చేపట్టారు. అందులో 3 ఇంచుల నీళ్లు పుష్కలంగా పడ్డాయి. దీంతో మంగళవారం గ్రామ సర్పంచు మధుకేశన్న చేతుల మీదుగా గంగమ్మ తల్లికి బలిహరణం గావించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దీంతో గ్రామ ప్రజల నీటి కష్టాలు తీర్చారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలోని హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో గుంటూరు జిల్లా కాకనూరు మండలం, కొండవారిపాలెంకు చెందిన జీపీ చౌదరి వృషభాలు నిర్ణీత సమయానికి 3100 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలువగా రూ.50 వేలు నగదు బహుమతి ప్రదానం చేశారు. కర్నూలు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్ గౌడు వృషభాలు 2900 అడుగులు లాగి రెండవ బహుమతి రూ.40 వేలు దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా కొండవారిపాలం జీపీ చౌదరి రెండో జత 2400 అడుగులు లాగి మూడో బహుమతి రూ.30 వేలు కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా, చాగంటి నాగేశ్వరరావు (సీఎస్ఆర్) వృషభాలు 2,325 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.20 వేలు, కర్నూలు మండలం రుద్రవరం ఎల్లగౌడు వృషభాలు ఐదో బహుమతి రూ.10 వేలు, కన్నమడకల చాకలి ఈశ్వరయ్య వృషభాలు ఆరో బహుమతి గా రూ.4 వేలు గెలుచుకున్నట్లు సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, అబ్దుల్ రహీమ్, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, సర్పంచు కేపీ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

- ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు చేయండి
- ఓటర్ల అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ సృజన



కల్లూరు అర్బన్‌లో నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, పాణ్యం ఆర్వో/జేసీ మౌర్య

కర్నూలు: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. కర్నూలు మండలం ఎదురూరు గ్రామంలో మంగళవారం ఉదయం ఓటర్ల అవగాహన ర్యాలీ జరిగింది. ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి కేంద్ర సాయుధ బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఓటర్ల అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే స్థానిక పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా ఓటర్లను భయపెట్టినా, ప్రలోభపెట్టినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా, శాంతి భద్రతలను కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో కవాతు

ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు దేవనకొండ యూపీఎస్ సీఐ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెర్నెకల్లు, నేలతలమర్రి, గుండ్లకొండ గ్రామాల్లో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. అలాగే నందవరం ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో ముగితి, నందవరం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు.

ఓటు..ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం

కల్లూరు: ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అని, దీనిని ప్రతి ఓటరు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. మంగళవారం పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్‌లోన్ని ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఆటో స్టాండ్ వరకు నిర్వహించిన ఓటర్ల అవగాహన ర్యాలీలో ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్యతో కలిసి వారు పాల్గొన్నారు. ముజఫర్‌నగర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలోని 112, 113, 114, 115, 116, 117 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే కాక పోలింగ్ శాతం పెరిగేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, డీఎస్పీ విజయ శేఖర్, మెప్మా పీడీ నాగ శివలీల, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం మన బాధ్యత

కర్నూలు (టౌన్) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వినియోగం మనందరి బాధ్యత అని కర్నూలు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం ఓటు హక్కు వినియోగంపై స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి మున్సిపల్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్‌నగర్, రోజా దర్గా, రాధాక్రిష్ణ ఆసుపత్రి, మోడరన్ ఫంక్షన్ హాలు, అంబికా శిశు కేంద్రం, టంగుటూరు ప్రకాశం పంతులు స్మారక నగరపాలక పాఠశాల, మదర్ థెరిస్సా కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ కుమార్, నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు డాక్టర్ పెంచలయ్య, స్పెషల్ ఆఫీసర్ మన్సూర్ బాషా, మెప్మా సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

అన్నిమార్గాల్లో చెక్‌పోస్టులు



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం : నంద్యాల జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తమ్మరాజుపల్లె వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోకి నగదు, మద్యం, గంజాయి తదితర అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దులో చెక్‌పోస్టు చేసినట్లు చెప్పారు. చెక్‌పోస్టులో షిఫ్టుల వారీగా విధులు నిర్వహించి 24 గంటలు వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనుమానం వచ్చిన వాహనంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, సీఐ సూర్యమౌళి, ఎస్ఐ ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

గడివేముల: మండల పరిధిలోని ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన రెడ్డిపోగు విజయకుమార్ అను వ్యక్తి మంగళవారం మద్యం తాగి మోటార్ సైకిల్ డ్రైవ్ చేసిన కేసులో నంద్యాల సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ 14 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ విషయాన్ని మంగళవారం ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య విలేకరులకు వెల్లడించారు. ఎవరైనా మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి



వైఎస్సార్‌సీపీ నాయకులతో కుడా చైర్మన్ కోట్ల హర్ష, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

కోడుమూరు రూరల్ : ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను నాయకులు, కార్యకర్తలు భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల మండలానికి చెందిన పలు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కోడుమూరులో సమావేశమై ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను పరిచయం చేశారు. ఆమెను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా పార్టీలకతీతంగా ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని, జగనన్న గెలుపునకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని కోట్ల హర్ష కోరారు.

మేమంతా సిద్ధం సభను జయప్రదం చేయండి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఈనెల 29వ తేదీన ఎమ్మిగనూరులో నిర్వహించే సభకు కోడుమూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కోడుమూరులో మేమంతా సిద్ధం సభపై జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, కృష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, స్థానిక నేతలు మల్లారెడ్డి, రాఘవేంద్రలతో సమావేశమై చర్చించారు.

కుడా చైర్మన్‌ను కలిసిన కంబదహాల్ నాయకులు



కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసిన కంబదహాల్ నాయకులు

సి.బెళగల్: కుడా చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని సి.బెళగల్ మండలం కంబదహాల్ గ్రామ నాయకులు కలిసి పార్టీ బలోపేతానికి తమ మద్దతును తెలిపారు. మంగళవారం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు శోభారాణి, జెడ్పీ హైస్కూల్ పీఎంసీ చైర్మన్ రాముడు, గ్రామ పెద్ద సత్యనారాయణ రెడ్డి కుడా చైర్మన్‌ను కలసి ఎన్నికల విషయంపై మాట్లాడారు. రాబోయే ఎన్నికలలో గ్రామంలో వైఎస్సార్‌సీపీ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్యల గెలుపునకు పని చేయాల్సిన విధానాలపై చర్చించారు. కుడా చైర్మన్ మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థుల భారీ మెజార్టీకి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో పని చేయాలన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

పాణ్యం: విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరవని శాంతిరాం మెడికల్ హాస్పిటల్ గైనిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కార్తీకి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులకు ఆరోగ్యం, పోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సుబ్రహ్మణ్యం, మహిళ కో ఆర్డినేటర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ చెన్నసోమేశ్వరుడి ఉత్సవాలు

- భక్తులకు సంతాన సాఫల్య ప్రసాదం పంపిణీ చేసిన అర్చకులు
- వసంతోత్సవంలో స్వామి, అమ్మవార్లు
- చక్రస్నానంతో ఉత్సవాల ముగింపు



శ్రీ చెన్నసోమేశ్వస్వాములకు వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



భక్తులకు సంతాన సాఫల్య ప్రసాదం పంపిణీ చేస్తున్న పూజారులు

సి.బెళగల్ : మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ఈ నెల 19న అంకురార్పణతో ప్రారంభమైన శ్రీ చెన్నసోమేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం చక్రస్నానంతో ముగిశాయని ఆలయ ప్రధాన అర్చకులు బీచుపల్లి తెలిపారు. గ్రామంలో స్వయంభూగా వెలసిన స్వామి వారి ఉత్సవాలను ఎనిమిది రోజులపాటు భక్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించి, భక్తులకు సంతాన ప్రసాదం పంపిణీ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున సంతాన సాఫల్య ప్రసాదం కోసం భక్తులు తరలివచ్చారు. ప్రసాద వినియోగంపై ప్రధాన అర్చకులు బీచుపల్లి నియమ, నిష్ఠలను వివరించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారి ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించి ఆలయ ఆవరణలో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలపై రంగులు చల్లి సంబరాలు జరుపుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవ కంకణాల వితరణను ఆలయ అర్చకులు శాస్త్రోత్సంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం శ్రీ చెన్నసోమేశ్వర, పార్వతి, గంగాదేవి ఉత్సవ విగ్రహాలను అర్చకులు పల్లకీలో కొలువుంచి గ్రామంలో మేళతాలాలతో ఊరేగించారు. అనంతరం దేవతా మూర్తుల విగ్రహాలను గ్రామంలోని అమ్మవారి బావి వద్దకు తీసుకెళ్లి చక్ర స్నానం చేయించారు. చక్రస్నానంతో గ్రామంలో ఉత్సవాల తంతూ ముగిసిందని ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి ప్రకటించారు. ఉత్సవాలు విజయవంతంగా ముగిసినందుకు భక్తులు, గ్రామ పెద్దలకు, ప్రజలకు, పోలీస్ వారికి పద్మనాభరెడ్డి, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

బండలాగుడు పోటీల విజేతలకు బహుమతులు

ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన పాలపళ్ల ఎద్దుల పోటీలలో 24 జతల ఎద్దులు పోటీ పడగా, పి.రుద్రవరం గ్రామానికి చెందిన రైతు గోపాల్ ఎద్దుల జత మొదటి స్థానంతో రూ.40 వేలను, వెల్దుర్తి మండలం కలుగట్ల రైతు రమేష్‌నాయుడు వృషభాలు రెండవ స్థానంతో రూ.30 వేలు, గద్వాల జిల్లా జమ్మిచేడు, జీ రంగాపురం గ్రామాలకు చెందిన వెంకటేష్, వడ్డె అంజిల సంయుక్త ఎద్దుల జత మూడవస్థానంతో రూ.20వేలను దక్కించుకున్నాయి. డోన్ మండలం మల్యాల గ్రామ రైతు షేక్‌మైమూన్ ఎద్దులు నాల్గవ స్థానంతో రూ.10 వేలను, సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామానికి చెందిన గట్టిగారి సురేష్ ఎద్దుల జత ఐదవ స్థానంతో రూ.5 వేల నగదును సొంతం చేసుకున్నాయి.

పొట్టేళ్ల పందెం విజేతలు..

పొట్టేళ్ల పోటీల్లో అయిజకు చెందిన రాజు పొట్టేలు మొదటి స్థానంతో రూ.15 వేలను, మారుమునగాలకు చెందిన రామాంజనేయులు పొట్టేలు రెండవ స్థనంతో రూ.10 వేలను, అయిజకు చెందిన ప్రవీణ్ పొట్టేలు మూడవ స్థానంతో రూ.8 వేలు, పాలకల్‌కు చెందిన మల్లేష్ పొట్టెలుకు నాల్గావ స్థానంతో రూ.4లను, మూల్లగూర్తికి చెందిన భైరవ పొట్టెలుకు ఐదవ స్థానంతో రూ.5 వేలను, గొందిపర్లకు చెందిన ప్రభాస్ పొట్టేలుకు ఆరవ స్థానంలో నిలువగా రూ.4 వేల నగదును దాతలు అందజేశారు.

న్యూ క్యాటగిరీ ఎద్దుల విభాగంలో..

మంగళవారం న్యూ క్యాటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించగా ప్రకాశం జిల్లాకు చెందిన ఉమ్మారెడ్డిశ్రీవల్లి ఎద్దులు మొదటి స్థానం, రెండవ స్థానంలో గద్వాల జిల్లాకు చెందిన కురువ కర్రెన్న ఎద్దులు, మూడవ స్థానంలో గద్వాల జిల్లాకు చెందిన రామాంజనేయులు, అజయ్‌ల సంయుక్త ఎద్దుల జత, నాల్గవ స్థానంలో సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామ రైతు జానకిరాముడు ఎద్దులు, ఐదవస్థానంలో కోడుమూరు మండలం వర్కూరుకు చెందిన తలారి రామచంద్రుడు, సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామంకు చెందిన వేణుగోపాల్ నాయుడులకు చెందిన సంయుక్త ఎద్దుల జత, ఆరవ స్థానంలో సి.బెళగల్ మండలం పోలకల్‌కు చెందిన మహేంద్రనాయుడు ఎద్దుల జత నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.50, రూ.40, రూ.30, రూ.20, రూ.10, రూ. 5 వేల నగదు బహుమతిని దాతలు ఎద్దుల యజమానులకు అందజేశారు. ఇతర ప్రాంతాల నుంచి బండలాగు పోటీలకు వచ్చిన రైతులకు భోజన వసతిని గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు కల్పించారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. అలాగే ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాక పాఠశాల ఆవరణలో వైద్య సిబ్బంది వద్ద మందులను పరిశీలించారు.

సి.బెళగల్: మండలంలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి సైన్స్ (జీవశాస్త్ర) పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆయా పాఠశాల డిపార్టుమెంటల్ అధికారులు కిష్టన్న, వంశీమోహన్, కేశవనాథ్, బలరాముడు, సునీల్ రాజు, సత్యనారాయణ తెలిపారు. కాగా పరీక్షకు పలువురు గైర్హాజరయ్యారన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

- ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనే అందుకు నిదర్శనం
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోందని, అందుకు ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనే నిదర్శనమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది టీడీపీ మరింత బలహీన పడుతోందన్నారు. మంగళవారం కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనతో రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దొడ్డిపాడు గ్రామానికి చెందిన చిన్న, హుస్సేన్‌మియ్య, రాజు, గోవిందు, సోమన్న, కాశింవలి, సుభాన్, మిన్నేళ్ల, చాంద్‌బాషా, శాంతి, జూలక్క, రాణెమ్మ, రమిజాబీ, మాసుంబీ, రామాంజనమ్మ, ప్రమీలమ్మ, మహాలక్ష్మి, ఫాతిమా తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మునిస్వామి, నాయకులు హనుమంతురెడ్డి,చంద్రారెడ్డి, మహేష్, మన్సూర్ అలీ, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి ..

ఓర్వకల్లు: హుసేనాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌లాల్‌తో పాటు మరో 10 వైఎస్సార్‌సీపీ కుటుంబాలను గ్రామ టీడీపీ నాయకుడు మల్లెల రాజశేఖర్ ప్రలోభాలకు గురిచేసి బలవంతంగా ఇటీవల పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌర చరితారెడ్డి సమక్షంలో టీడీపీలో చేర్పించారు. అయితే, ఆ పార్టీ సిద్ధాంతాలు, నాయకుల తీరు నచ్చక వారంతా తిరిగి మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నాగతిరుపాలు, చిన్న అయ్యన్న, లోటర్ బాషా పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో పార్టీలో చేరుతున్న మహబూబ్‌లాల్

ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పండి



పాణ్యం చెంచుకాలనీలో ప్రచారం చేస్తున్న ఉమామహేశ్వరమ్మ

పాణ్యం: ఐదేళ్ల పాటు ప్రజాసేవకు దూరంగా ఉండి..ఇప్పుడు అధికారం కోసం వద్దకు వస్తున్న ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ఓటర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం పాణ్యం పట్టణం (పాణ్యం తెలుగుపేట, గడ్డంపేట, గోడన్‌చెలు, నూలుమిల్లు కాలనీ, చెంచుకాలనీ)లో ఆమె రెండో రోజు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ హామీలతో మభ్యపెట్టేందుకు ప్రతిపక్ష నాయకులు కరపత్రాలు తీసుకుని గ్రామాలకు వస్తున్నారన్నారు. వారిని గుమ్మం బయటే నిలబెట్టి మా గ్రామానికి, మండలానికి, నియోజకవర్గానికి మీరేం చేశారని ప్రశ్నించాలన్నారు. ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందిస్తున్నారన్నారు. రైతులు రెండుకార్ల పంటలు పండించుకునేందుకు అవసరమైన నీరు అందించారన్నారు. మరో మారు నియోజకవర్గ ప్రజలు ఆయనకు అండగా నిలబడి గెలిపించాలని కోరారు. కాగా కాటసాని ఉమామహేశ్వరమ్మ ప్రచారంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఇళ్ల వద్ద చీరె, సారె ఇచ్చి గౌరవించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎసర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాయుడు, పుల్లయ్య, టైలర్‌బాషా, చికెన్‌వలి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, బాబు, ఆటోమాబు, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.